# పోలీసు హింసకు 'పెద్ద'మనుషులందరూ బాధ్యులే

నాలుగు రోజుల వ్యవధిలో పోలీసుల దెబ్బల వల్ల రాష్ట్రంలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం అసాధారణమే, కానీ అందులో పెద్దగా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు.

మన రాష్ట్రంలో వేరే ఏమయినా మారి ఉండవచ్చుగానీ పోలీసుల 'పనితీరు' ఇన్ని దశాబ్దాల కాలంలో ఏమాత్రం మారలేదు. పోలీసు అధికార్లలో పెద్ద చదువులు చదివిన వారి సంఖ్య పెరిగింది, వాక్చాతుర్యం పెరిగింది, హక్కుల పరిభాష సహితం ప్రయోగించే అలవాటూ పెరిగింది. క్షణాలమీద సమాచారాన్ని అందిచ్చే టెలికమ్యూనికేషన్ వ్యవస్థ వచ్చింది, అందిచ్చిన సమాచారాన్ని భద్రంగా పోగుచేసే కంప్యూటర్ వ్యవస్థ వచ్చింది, అతివేగంగా ప్రయాణించే జీపులొచ్చాయి, ముసలి రైఫిళ్లు పోయి మీటనొక్కితే బులెట్ల వర్షం కురిపించే ఆటోమేటిక్ తుపాకులొచ్చాయి.

అన్నీ మారాయిగానీ నేరపరిశోధన అంటే కొట్టి ఒప్పించడం అన్న అభిప్రాయం మాత్రం మారలేదు. మారకపోగా, కొట్టడానికి మరింత సమర్థమైన సాధనాలు వారిచేతిలోకి వచ్చాయి కాబట్టి ఇంకింత క్రూరంగా కొడుతున్నారు. రెండేళ్ల కింద హైదరాబాద్‌లో జరిగిన 'ఆగస్ట్ 28' లాఠీచార్జిలో పోలీసులు పాతకాలపు కట్టె లాఠీల స్థానంలో సాంకేతికంగా రూపొందించిన లాఠీలు ప్రయోగించారనీ అంతటి గట్టి దెబ్బలు అంతకు ముందెప్పుడూ తినలేదనీ ఉద్యమాలలో కాకలుతీరిన వారే అన్నారు.

అయితే కేవలం కొత్త సాధనాలు వారిచేతిలోకి రావడమేకాదు పోలీసుల పనితీరులో వ్యవస్థిత క్రూరత్వం కూడ చాలా పెరిగింది. గతంలో విని ఎరుగని చిత్రహింసల పద్ధతులు ఈమధ్య కాలంలో చూస్తున్నాం. ఇవి ప్రయోగిస్తున్నవారు బాగా చదువుకొని తీరిక సమయాలలో తత్వం మాట్లాడే పోలీసు అధికారులే. కిందిస్థాయి కానిస్టేబుళ్లు మాత్రమే కాదు, యుపిఎస్‌సి పరీక్షలలో చరిత్ర నుండి తత్వశాస్త్రం దాకా అన్నిటి గురించి తెలివిగా సమాధానాలు చెప్పి ఐపిఎస్ పట్టా పొందినవారు కూడ యూనిఫారం తొడుక్కున్న రెండవ రోజు నుండి క్రూరమైన హింసను స్వయంగా ప్రయోగిస్తున్నారు.

కరెంటు షాకులు పెట్టడం ఒకప్పుడు లేదు. ఇప్పుడు 'ఇంటరాగేషన్' పద్ధతులలో అది అతి సామాన్యమైనదయిపోయింది. పాత ఇంగ్లీష్ సినిమాలలో బానిసల కాళ్లను చెక్కలలోని పొక్కలలో దూర్చి చెక్కలను గొలుసులతో బిగించి కట్టిన సీన్లు చూసే ఉంటారు. వరంగల్, కరీంనగర్ పోలీస్ స్టేషన్లలో ఇది జరుగుతుందంటే నమ్ముతారా? సీసా పైన మనిషిని కూర్చోబెట్టి సీసా మూతి ముడ్డిని చీల్చుకొని లోపలికి దూరేటట్టు మీది నుండి భుజాలు పట్టుకొని నొక్కుతారంటే నమ్ముతారా? ఆ సీసా మూతి విరగ్గొట్టి మరీ ఈ పని చేసిన సందర్భాలు ఒకటి రెండు లేకపోలేదంటే అసలే నమ్మరు కదూ?

ఇంక, చేతులకు తాళ్లు కట్టి మీది నుండి వేళ్లాడదీసి కట్టెలతో ఒళ్లు చితగ్గొట్టడం, కింద పడేసి ఒంటి మీద ఎక్కి బూటు కాళ్లతో తొక్కుతూ అరికాళ్ల మీద, ఒంటిమీద కట్టెలతో బాదడం, రోకలిబండలు ఎక్కించి చావగొట్టడం - ఇవి ముందు నుండీ ఉన్న పద్ధతులే.

మరి అడపాదడపా ప్రాణాలు పోతాయంటే ఎందుకు పోవు?

ఉదంతాలూ దృష్టాంతాలూ ఒళ్లు జలదరింప జేయవచ్చు. కానీ అర్థం చేసుకోవలసింది పోలీసు వ్యవస్థ వైఖరి కాలక్రమంలో రాటుదేలిన వైనం. చిత్రహింసలు ప్రయోగిస్తున్నందుకు పోలీసులు కొంచెం సిగ్గుపడిన రోజులు ఉండే ఉండాలి. ఇప్పుడు సిగ్గుపడకపోగా సమాజానికి సేవ చేస్తున్నామనుకుంటున్నారు. మైత్రీ సదస్సులూ వగైరాలు చూసి పోలీసు వ్యవస్థలో మానవత్వం ప్రవేశించిందని ఎవరైనా అనుకుంటే పొరబాటే. ప్రజాస్వామ్యం అనేది చేతకాని వాళ్ల ఆదర్శం, రాజకీయాలు దగుల్బాజీల కేళి, హక్కులు సంఘ విద్రోహుల ముసుగు, చట్టం చవటలు తొడుక్కునే కవచం అనే అభిప్రాయాలు కాలక్రమంలో ఘనీభవించి ఒక పోలీసు ప్రాపంచిక దృక్పథం ఏర్పడింది. ప్రజాస్వామ్యానికి సంబంధించిన అన్ని వ్యవస్థలు సంప్రదాయాల పట్ల పోలీసుజాతికి తొలినుండి ఉన్న చులకన భావం ఈ ప్రాపంచిక దృక్పథానికి పునాది వంటిది. పనికిమాలిన ఈ ప్రజాస్వామ్యంలో తమ లాఠీలూ తుపాకులే సమాజానికి రక్ష అనేది వారిలో స్థిరపడిపోయిన అభిప్రాయం. పోలీసు అధికార్లలో చదువుకున్న వారి సంఖ్య పెరగడం వల్ల ఈ వైఖరిలో మార్పు రాలేదు సరికదా, దీనిని సిద్ధాంతీకరించి మరింత గాఢంగా విశ్వసించే చాతుర్యం పెరిగింది.

మన రాజకీయ నాయకులలో మెజారిటీ కూడా ప్రజాస్వామ్యమంటే ఏమాత్రం గౌరవం లేని బాపతు. ఈ ప్రజాస్వామ్యం వారికొక ఆదాయ మార్గం కాకపోయినట్టయితే దానినెప్పుడో తగలబెడుదురు. అందువల్ల

ప్రజాస్వామ్య రాజకీయాలలో తలమునకలై ఉంటూ కూడ సమాజానికి పోలీసుల లాఠీయే రక్ష అని వారు సహితం నమ్ముతారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలీసు అత్యాచారాల గురించి అప్పుడప్పుడు కొంచెం అల్లరి చేసినా అధికారంలో ఉన్నప్పుడు కిక్కురుమనరు.

ఒకటికి రెండు లాకప్పు మరణాల వార్తలు పత్రికలలో ప్రముఖంగా రాగానే హోంమంత్రి కన్నెర్ర చేశారనీ, పోలీసుల పనితీరు పట్ల చాలా అసంతృప్తిగా ఉన్నారనీ పాలక పార్టీకి అనుకూలంగా ఉండే పత్రికలు రాస్తుంటాయి. వారు కన్నెర్ర చేయడం తప్ప వేరే ఏమీ చేయరని వారికీ తెలుసును, రాసే వారికీ తెలుసును.

అయినా ఒక్క రాజకీయ నాయకులనే ఎందుకు ఆడిపోసుకోవాలి? అప్పుడప్పుడు ఒక లాకప్ హత్య జరగబట్టే ఈమాత్రమైనా భద్రంగా బతుకుతున్నామని నమ్మే పెద్దమనుషులు అన్ని రంగాలలోనూ ఉన్నారు. ప్రొఫెసర్లలో ఉన్నారు, పత్రికా రంగంలో ఉన్నారు, జడ్జిలలో ఉన్నారు, సకల తెల్లబట్టల వృత్తులలోనూ ఉన్నారు. వీళ్లంతా కలిసి తమందరి బాధ్యత అయిన అనేక విషయాలను పోలీసులకు అప్పగించి పక్కకు తప్పుకుంటున్నారు. పోలీసు వ్యవస్థ విజృంభించి ఈ ఖాళీని తన బూట్లతో లాఠీలతో ఆక్రమించుకుంటున్నది.

లేకపోతే అల్లర్లు జరిగే ప్రాంతాలలో శాంతి కమిటీలు పోలీసుల ఆధ్వర్యంలో ఎందుకు ఏర్పడాలి? బడికిపోని పంతుళ్లను 'మా ఊరికి రండి, మాతో ఉండండి' అని ప్రజలు పోలీసుల ప్రోత్సాహంతో ఎందుకు చక్కదిద్దాలి? అమ్మాయిల కాలేజీల దగ్గర తిరిగే పోకిరీలకు పోలీసులే ఎందుకు బుద్ధి చెప్పాలి? ప్రజాస్వామ్యం వల్ల వచ్చే అన్ని ప్రయోజనాలూ పొందుతూ ప్రజాస్వామ్యం అంటేనూ, అది మనందరి మీదా పెట్టే బాధ్యతలంటేనూ మనసులో గౌరవం లేని తెల్లబట్టల జాతి ప్రజాస్వామ్యాన్ని పోలీసు వ్యవస్థ పాదాల దగ్గర పడేసింది. మరి ఇక్కడొక యాదగిరి, అక్కడొక పుల్లన్న ఎందుకు చావరు?

ఈ విషయంలో అందరికంటె ఎక్కువగా న్యాయవ్యవస్థను తప్పుపట్టాలి. ఎందుకంటే ప్రత్యేకమైన సామాజిక స్పృహగానీ చొరవగానీ అవసరం లేకుండ తమ వృత్తిరీత్యానే పోలీసుల అక్రమాలను అరికట్టగలిగినది న్యాయమూర్తులే. కానీ కొన్ని అరుదయిన మినహాయింపులతో - న్యాయమూర్తులకు ఈ విషయంలో ఆసక్తి లేదు, సంకల్పం అసలే లేదు. అయిదేళ్ల కింద సుప్రీంకోర్టు 'డికె బసు కేసు'లో పోలీసుల విధి నిర్వహణకొక వివరమైన ప్రవర్తనా నియమావళి ప్రకటించింది. దానిని అతిక్రమిస్తే కోర్టు ధిక్కారం అవుతుందనింది. ప్రతిరోజూ పోలీసులు ఆ నియమావళిని ధిక్కరిస్తూనే ఉంటారు. ఆ సంగతి మేజిస్ట్రేటుల నుండి హైకోర్టు జడ్జిల దాకా అందరి దృష్టికీ వస్తూనే ఉంటుంది. అయినప్పటికీ ఈ అయిదేళ్ల కాలంలో 'డికె బసు' నియమావళిని అతిక్రమించినందుకు కోర్టు ధిక్కారానికి జైలుకు పోయిన ఒక్క పోలీస్ అధికారీ దేశంలో లేడు.

బాధ్యత గలవాళ్లందరూ ప్రదర్శిస్తున్న ఈ బాధ్యతా రహితమైన వైఖరికి బలవుతున్నది 'కరడుగట్టిన నేరస్తులే'ననుకుంటే పొరబాటు. అటువంటివాళ్లు సమాజంలో లేకపోలేదు. కానీ పోలీసు హింసకు బలయ్యేది వాళ్లు కారు. ఎందుకు కారనే చర్చలోకి ఇక్కడ పోలేముగానీ పోలీసు హింసకు బలయ్యేది సాధారణ జీవితం గడుపుతూ తెలిసో తెలియకో నేరంలో - లేక నేర అభియోగంలో - ఇరుక్కున్నవారేననేది వాస్తవం.

ఏప్రిల్ నెలలో చనిపోయిన నలుగురు ఎవరో చూస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది.

రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌లో చనిపోయిన నర్సింహులు 50 సంవత్సరాల వయసున్న హమాలీ. 'అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు' అనేది అతనిపైన పోలీసుల అభియోగం. మెదక్ జిల్లా రామాయంపేట సమీపంలోని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు అకారణంగా పట్టుకొని చితగ్గొట్టగా ఆత్మహత్య చేసుకొని చనిపోయిన సంపంగి రాజయ్య కంకర మిషన్ దగ్గర కూలిపని చేసే వడ్డెర కులస్తుడు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో పోలీసులు పట్టుకొని కొట్టగా చనిపోయిన చిన్నపుల్లన్న చెరువులో చేపలు పట్టుకొని బతికే 50 సంవత్సరాల వయసున్న బెస్త కులస్తుడు. మెదక్ జిల్లా తొగుట పోలీసులు పట్టుకొని కొట్టి, చంపి, రహస్యంగా పూడ్చిపెట్టిన యాదగిరి సామాన్య రైతు కుటుంబానికి చెందినవాడు. ఇతనొక్కడిమీద హత్య చేసాడన్న అభియోగం ఉండింది. అయితే అది కాకతాళీయంగా జరిగిన హత్యే తప్ప యాదగిరి వృత్తినేరస్తుడు కాడు, కిరాయి హంతకుడు కాడు.

వృత్తినేరస్తులనైనా కొట్టిచంపే అధికారం పోలీసులకు లేదుగానీ, వాస్తవానికి వారి చేతిలో చనిపోతున్నది చిన్నా చితక కారణాల వల్ల బందీలయిన చిన్న జనం. ఏవేవో గంభీరమైన కారణాలు చూపించి అందరూ ఉపేక్షిస్తున్న పోలీసు దౌర్జన్యాలకు పదే పదే బలవుతున్నది ఈ జనమే. ప్రభుత్వం నుండి న్యాయవ్యవస్థ దాకా ఎవ్వరికీ దీనిని అరికట్టాలన్న ఆసక్తిలేదు. మరి మనం కూడ చూస్తూ ఊరుకుంటే దిక్కులేని జనం ఇంకెంత మంది - నెలకు ఇద్దరో ముగ్గురో - చస్తూ ఉండాలి?

**మానవహక్కుల వేదిక**

23 ఏప్రిల్ 2002

Human Rights Forum

## కొన్ని హింసలు...

* కరీంనగర్‌లో ఒక యువ దళిత *IPS* ఆఫీసర్, *OSD*లు కలిసి స్వయంగా తనకు కరెంట్ షాక్ పెట్టారని ఒక దళిత బాధితుడు చెప్పాడు. మెదక్ 'వార్త' విలేకర్ని పోలీసులు చిత్రహింసకు గురిచేసినప్పుడు, ఆ విలేకర్ని జర్నలిస్ట్ యూనియన్ హోం మంత్రికి చూపెట్టినప్పుడు, "అయ్యో ఇంత బాగా కొట్టారా, నేను నిన్ను కొట్టొద్దని చెప్పానే" అన్నారాయన. అంటే ఆయన మాటకు సహితం అంత విలువ ఉందన్నమాట.

* వరంగల్‌లో ఒక టీచర్ కాలును కఱ్ఱదుంగ రంధ్రంలో పెట్టి స్క్రూలు ఫిట్ చేయడం వల్ల ఆయన కాలు చర్మం కండతో తెగి బయటకు వచ్చింది. ఇప్పటికీ ఆయన సరిగ్గా నడవ లేకపోతున్నాడు. వరంగల్‌లో టీచర్లను, లెక్చరర్లను చివరకు ఒక డాక్టర్‌ను కూడా ఈ కఱ్ఱ దుంగతో బాధించారు.

* మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో ఒక యువ *IPS* ఆఫీసర్, ప్రతిభా పురస్కారం పొందిన ఒక టీచర్‌ను "నీకు పురస్కారం ఎవడిచ్చాడ్రా?" అంటూ స్కూలు పిల్లలను పిలిపించి, వాళ్ళతో ఆ టీచర్‌ను పోలీస్ స్టేషన్‌లో కొట్టించాడు.